క్లుప్తంగా

శాకంబరి అలంకారంలో వరాల సుంకులమ్మ



కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన వరాల (వజ్రాల) సుంకులమ్మ శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని కూరగాయలు ప్రత్యేకంగా అలంకారంలో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు శాకాంబరి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లను చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జూదరుల అరెస్టు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు, అయ్యవారిపల్లె గ్రామాల వద్ద వేరువేరుగా ఆదివారం జూదమాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.10,650 నగదును స్వాదీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ జిల్లాస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారు ఆగస్టులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 180 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. బాలబాలికలకు జూనియర్, సబ్‌జూనియర్, కేడెట్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, సెక్రటరీ నాయబ్‌రసూల్, ఆర్గనైజన్ సలీం, బాషా, న్యాయవాది రమేష్, తైక్వాండో అసోసియేషన్ నెల్లూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అనంతపురం కార్యదర్శి సాయిబాబా, కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్, తైక్వాండో కోచ్‌లు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

కలసపాడు : యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లా కరోలి గ్రామానికి చెందిన శివకిరణ్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం కలసపాడుకు చేరుకుంది. కలసపాడుకు చెందిన పీరారెడ్డి, రామకోటి, పెద్దయ్య, బోరుబాలుడు శివకిరణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ యువత అభద్రతా భావం విడనాడాలని, ధైర్యంగా ఉండాలని సూచించారు.

హెల్మెట్‌తోనే రక్షణ

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనాలు నడిపే యువతకు హెల్మెట్‌తోనే రక్షణ అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. ఆర్‌ఆర్ రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన హెల్మెట్ ధరించండి అనే ప్రచార కరపత్రాలను ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు.

గ్రామ సింహాలతో జనం గజ గజ

- వీధుల్లో గుంపులుగా శునకాల సంచారం
- వాహనచోదకులు, నడిచివెళ్లేవారిపై దాడులు
- అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమంటున్న వైద్యులు



వీధుల్లో గుంపుగా ఉన్న వీధికుక్కలు

కొండాపురం : గ్రామాల్లో కుక్కల బెడద ప్రజలకు పెద్దసమస్యగా మారుతోంది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. బైకుపై వెళుతున్న, నడిచివెళ్లేవారిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల మండలంలోని బెడుదూరు గ్రామానికి చెందిన ఓ గొల్ల కాపరివి 12 గొర్రెపిల్లలను కరిచి చంపడంతో సుమారు రూ.50 వేలకు పైగా నష్టం జరిగింది. వీటిని నియంత్రించడంలో సంబంధిత అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

మండల కేంద్రంలో వీధికుక్కలు ప్రధాన కూడళ్లలోని చికెన్ సెంటర్ల వద్ద, మాంసం విక్రయ కేంద్రాలు వద్ద తిష్ట వేస్తున్నాయి. 15 నుంచి 20 కుక్కల వరకు గుంపులుగా తిరుగు తున్నాయి. ప్రజలు ఆదివారం చికెన్ సెంటర్ల వద్ద కొనుగోలు చేసుకుని తీసికెళుతున్న కవర్లను లాకెళ్లుతున్నాయి. కుక్క కరుస్తుందని భయంతో కవర్లను వదిలేస్తున్నారు.

రేబీస్ సోకిన కుక్కల లక్షణాల వివరాలు :

ఇంట్లో సాకిన, లేదా వీధి కుక్కలు కరిచినా 14 రోజుల పాటు లక్షణాలు పరిశీలించాలి. రేబీస్ వ్యాధి సోకిన కుక్క ఇంట్లో వారి మాట వినదు. ఇంట్లో ఆహారం సరిగా తీసుకోదు. తరుచూ నోటి నుంచి సొంగ కారుస్తూ ఉంటుంది. రెండుకాళ్ల మధ్యలో తోక ముడుచుకుంటున్న దానిని బట్టి కూడా రేబీస్ సోకిన కుక్కలా గుర్తించవచ్చు.

కుక్కకాటుకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు :

కుక్క కరిచిన మరు క్షణం ట్యాప్ వాటర్‌తో డిటర్జెంట్ సోప్‌తో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టుకడితే వైరస్ మరింతగా వ్యాప్తిచెందే ప్రమాదం ఉంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కరిచిన చోటు, విధానం రేబీస్ కుక్క అయితే దానిని బట్టి ఐదు నుంచి ఏడు ఇంజెక్షన్లు వేస్తారు. పిచ్చికుక్క కరిస్తే హీనో గ్లాబిన్ ఇంజెక్షన్ వేయించుకోవాలి .

వీది కుక్కల బెడద లేకుండా చూడాలి



మండల కేంద్రంలోని కొండాపురం, పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కొండాపురం స్టేట్ బ్యాంక్ సమీపంలోని నూతన బైపాస్‌రోడ్డులో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. చికెన్ షాపుల వద్ద నుంచి ప్రజలు వెళ్లేటప్పుడు చికెన్ కవర్‌ను లాకెళ్లుతున్నాయి. బి.కొట్టాలపల్లె గ్రామంలో వృద్ధులను వీధి కుక్కలు కరిచాయి. అధికారులు స్పందించి వీధికుక్కల నివారణపై చర్యలు తీసుకోవాలి.

– కర్నాటి అనిల్‌కుమార్‌రెడ్డి, చౌటిపల్లె గ్రామం.

నిర్లక్ష్యం చేయవద్దు



కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి అది ఏమి చేస్తుందిలే అనుకుంటే ప్రాణానికే ముప్పు. కనీసం నాలుగు ఇంజెక్షన్లు వేసుకోవాలి. కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ల కొరత లేదు. ప్రజలు సునకాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వాటితో చనువుగా ఉండకూడదు.

– డాక్టర్ సుజాత, కొండాపురం.

ట్రాఫిక్ బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సర్వజన ఆసుపత్రి ముందు ఉన్న రోడ్డులో స్పీడు బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ఈ విషయం సాక్షి పత్రికలో ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు ఆసుపత్రి ముందు వాహనాలు వేగంగా వెళ్లకుండా రోడ్డుకు మధ్యలో ట్రాఫిక్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రజలు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



రోడ్డులపోలీసులు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు

బోగాదమ్మకు వెడి కిరీటం బహూకరణ

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల కోరుకొండపై వెలసిన బోగాదమ్మతల్లికి సింహాద్రిపురం మండలం కోరవకుంటపల్లె గ్రామానికి చెందిన కొండ్రెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు వెండి కిరీటం బహూకరించారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు వారు అందజేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.



వెండి కిరీటం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిలంకూరులో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



వేంపల్లె : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : చిలంకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–91 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు. ఉపాధ్యాయులను పూలమాలలతో, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి విద్యార్థి దశలోని తీపిగుర్తులను గుర్తు చేసుకున్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక తలిశెట్టి సుబ్రహ్మణ్యం బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకగా సాగింది. 1979లో పదో తరగతి చదివిన విద్యార్థులు 45 ఏళ్ల తర్వాత కలిశారు. వేంపల్లె లోని రహదారులు, భవనాల శాఖ అతిథిగృహంలో ఆదివారం సమావేశమైన వారు తొలుత గురువులను సన్మానించారు. దివంగతులైన సహచరులను తలచుకుని వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు.

పట్టుదలే ఆయుధం

డాక్టరేట్ సాధించిన రైతుబిడ్డ



డాక్టరేట్ అందుకుంటున్న భాస్కర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఆకలి కష్టపడటాన్ని అలవాటు చేస్తుంది. ఆలోచన బతకడాన్ని నేర్పిస్తుంది. లక్ష్యం జీవితాన్ని విజయపథంలో నడిపిస్తుంది. ఇందుకు నిలువెత్తు నిదర్శనం ఆ యువకుడు. పట్టుదలే ఆయుధంగా కష్టాలు, కన్నీళ్ళను అధికమించి డాక్టరేట్ సాధించిన ఓ రైతుబిడ్డ ఘనత గురించి వివరాల్లోకి వెళితే బద్వేలు మండలం నందిపల్లె గ్రామానికి చెందిన పంగాబ్రహ్మారెడ్డి, రామసుబ్బమ్మ దంపతుల కుమారుడైన పంగాసు భాస్కర్‌రెడ్డి రసాయన శాస్త్రంలో మంగళూరు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. తల్లిదండ్రులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుండటంతో సుభాస్కర్‌రెడ్డి విద్యాభ్యాసం నందిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. బద్వేలులో న్యూవిద్యారణ్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశాడు.

ఉద్యోగం చేస్తూ..

అనంతరం వరంగల్ ఎన్ఐటీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేశాడు. గోవాలోని సింజెంటా అనే రసాయనాల కంపెనీలో ఉద్యోగం చేస్తూ సెలవు రోజుల్లో, వారాంతాల్లో దొరికే సమయాన్ని మంగళూరులో యూనివర్సిటీలో పరిశోధనలకు కేటాయించారు.

యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ భానుమంజునాథ్ పర్యవేక్షణలో నోవెల్ నైట్రోజన్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్ ఆఫ్ బయోలాజికల్ ఇంటరెస్ట్, సల్ఫాక్సిమిన్స్ అండ్ ఫొరజోల్ (3, 4–బి) పిరిడిన్ డెరివేటివ్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. విశ్వవిద్యాలయం నుంచి సుభాస్కర్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



పులివెందుల : గ్రామోత్సవంలో కోలాటం చేస్తున్న చిన్నారులు



కమలాపురంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా ఉత్సవ విగ్రహం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లెరోడ్డులో వెలసిన శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం మరాఠి హారతులను బాబాకు ఇచ్చి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబా ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఆవార్డు కౌన్సిలర్ గుల్జార్‌లు కలసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, తుమ్మలపల్లె, కనంపల్లె, అచ్చివెల్లి, ఎర్రిపల్లె, రాగిమానుపల్లె గ్రామాల్లో సాయిబాబా ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

కమలాపురంలో...

కమలాపురం : పట్టణ పరిధిలోని కుప్పూరువారిపల్లె గ్రామ శివారులో వెలసిన సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం సాయిబాబాను ప్రత్యేక వాహనంలో అలంకరించి పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

సింహాద్రిపురం : గురుపౌర్ణమి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. గురిజాల, కసునూరు, బలపనూరు తదితర గ్రామాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

వేముల : మండలంలోని బూమయ్యాగారిపల్లెలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు స్థానిక నేతలు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ బయపురెడ్డి, మండల పరిశీలకులు రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీలు మరకాశి శివకృష్ణారెడ్డి, రాజారెడ్డి, రవికుమారెడ్డి, తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం బక్తులకు అన్నదానం నిర్వహించారు.

పెద్దముడియం : మండలంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దపసుపుల గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగు : ముద్దనూరు రహదారిలో ఉన్న జ్ఞాన సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాటు చేశారు.



జమ్మలమడుగు : సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు



పులివెందులలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు గ్రామంలోని సాయిబాబ ఆలయంలో, పట్టణంలోని మహేశ్వనగర్ కాలనీలో వెలసిన శ్రీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు చేశారు.

ముద్దనూరు : స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం, చిన్నదుద్యాల, గంగాదేవిపల్లె గ్రామాల్లోని ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

లింగాల : మండలంలోని కాశిరెడ్డినాయన, లింగాల, కర్నపాపాయగారిపల్లె, వెలిదండ్ల, పార్నపల్లె, అంబకపల్లె, బోనాల, పెద్దకుడాల, తదితర గ్రామాల్లోని శివాలయాలు, కాశిరెడ్డినాయన, షిర్డిసాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులోని శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా కమిటీ సభ్యులు నిర్వహించారు. అలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొండాపురం : మండలంలోని వెంకటాపురం, బి.కొట్టాలపల్లె, చవ్వనాగాయపల్లె, కొండాపురం, పొట్టిపాడు, లావనూరు గ్రామాలల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె, వేంపల్లి, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబాఆలయం, కాశిరెడ్డినాయన ఆలయం, సంగాలపల్లె గ్రామంలోని శ్రీ శివకృష్ణ గోశాలలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు.

చెన్నూరు : స్థానిక బ్రాహ్మణవీధి, పరమటవీధి, కేటీఆర్ వీధి(ఎల్లమ్మ దేవాలయందగ్గర), కడప–కర్నూలు జాతీయ రహదారిలోని గోసుల కల్యాణ మండపం సమీపంలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్న దానం నిర్వహించారు.

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీల్లో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయాలలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి సందర్భంగా వివిధ ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం గోపాలపురం సమీపంలోని కోదండరామస్వామి, గంధం ఆలయ సమీపంలోని సాయిబాబా, ఊటుకూరు ప్రకృతి నగర్‌లోని సాయిబాబా ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

రేపటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

కమలాపురం : మండలంలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె, పొడదుర్తి, లేటపల్లె గ్రామాల్లో ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23, 24, 25వ తేదీల్లో ఎర్రగుడిపాడు, పొడదుర్తి గ్రామ సచివాలయాల్లో, 26, 27 తేదీల్లో పందిళ్లపల్లె ఆర్‌బీకే, లేటపల్లె సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. 0–5 సం. పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేస్తారని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు అలాగే ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు చేయుట, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేయుట, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం తదితర సేవలు అందిస్తామని ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరు

కమలాపురం : రక్తం ఏ ప్రయోగశాలలో తయారు చేయలేమని, కేవలం మనిషి మాత్రమే దానం చేయగలరని సీహెచ్‌సీ వైద్యురాలు తేజస్వి తెలిపారు. రక్త వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం కమలాపురంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువకేంద్రం, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. రక్తదానం చేసిన 25 మందికి పండ్లు, రసాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు మాసాలకొకసారి రక్తం దానం చేయవచ్చని, రక్తం దానం చేయడం వలన పాత కణాలు పోయి కొత్త కణాలు వస్తాయని, తద్వారా రక్తదాతలు చురుకుగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఎప్పుడో ఒక రోజు రక్తదాన శిబిరం పెట్టడం కంటే మంచి సంకల్పంతో రక్త వారోత్సవాల పేరుతో వారం రోజుల పాటు రక్త దాన శిబిరాలు రోజుకొక ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మ ఇస్తాడన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన విజయ్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న వైద్యులు

దివ్యాంగులకు దుస్తులు వితరణ

పులివెందుల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో రామతులశమ్మ 21వ వర్ధంతిని పురస్కరించుకుని కుమారుడు చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రవీంద్రారెడ్డి దివ్యాంగులకు దుస్తులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



దుస్తులను అందజేస్తున్న డాక్టర్ రవీంద్రారెడ్డి

ముగిసిన భవాని పీరు ఉత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలో స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని పీర్ల చావిడిలో భవాని పీర్లను కొలువుతీర్చి రెండు రోజులుగా పీర్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామోత్సవం వెంబడి పెద్ద ఎత్తున డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. బైపాసురోడ్డు, పార్నపల్లెరోడ్డు, పూలంగళ్ల సర్కిల్ మెయిన్ బజార్ మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం, దేనేపల్లె, శెట్టివారిపల్లె గ్రామాల్లో జాతర పీర్ల మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మంగపట్నంలోని శ్రీ పెనుగొండ బాబయ్య స్వామి జాతర పీర్ల ఉత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీర్ల ఊరేగింపు సందర్భంగా భక్తులు చదివింపులు, మొక్కుబడులు చెల్లించారు. ఉత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో భక్తులు



ముద్దనూరు : జాతరపీర్ల ఊరేగింపును తిలకిస్తున్న ప్రజలు

మానవత్వం చాటుకున్నారు

ఎర్రగుంట్ల : స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో దీన స్థితిలో ఉన్న అనాథ వృద్ధురాలిని తిప్పలూరు గ్రామంలోని ఎద్దుల పెద్దశేషమ్మ వృద్ధాశ్రమంకు ఆదివారం ఎర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తరలించారు. ఆశ్రమం నిర్వాహకుడు నాగేంద్రతో మాట్లాడి వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించాడు.



వృద్ధురాలిని ఆశ్రమంకు తరలిస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి